క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా ముందుకు..


గూళ్యంలో కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి

హాలహర్వి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దామని ఆలూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విరుపాక్షి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని చాకిబండ, చింతకుంట, సిరగాపురం, మెదేహాల్, కామినహాల్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి సన్మానించి, బ్రహ్మరథం పట్టారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో తెలియజేయాలన్నారు. అంతకముందు గూళ్యం గాదిలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్ర కోకన్వీనర్ జనార్దన్‌నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ రంజిత్, ఎంపీటీసీ గోపాల్, సద్దాంహుసేన్, రాముడెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

మద్దికెర: పేద విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకానికి స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతున్న సౌమ్య, రాణి అనే విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప బుధవారం తెలిపారు. వారికి నాలుగేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు స్కాలర్‌షిప్ అందజేస్తుందన్నారు.

మద్దమాంబకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న మద్దమాంబ అమ్మవారు

మద్దికెర: స్థానిక మద్దమాంబ అమ్మవారికి బుధవారం పౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణలు చేసి అష్టోత్తరనామార్చన, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ రాజన్నయాదవ్, మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, రాయుడు, సుంకు రవీంద్ర, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు విజయ్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం


పాలకుర్తి ఆరోగ్య కేంద్రం

దేవనకొండ: మండలంలోని పాలకుర్తి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. పెయింటింగ్ పనులు కూడా పూర్తి కావడంతో త్వరలోనే హెల్త్ సెంటర్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాశ్

పత్తికొండ టౌన్: గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలో బకాయి ఉన్న గ్రంథాలయ పన్నులను చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాశ్ కోరారు. గురువారం పత్తికొండ పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్దుర్తి, జలదుర్గంలో గ్రంథాయాలకు నూతన భవనాల నిర్మాణం పూర్తయ్యిందని, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. గ్రంథాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక గ్రంథాలయాధికారి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించనున్న వైఎస్సార్ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు దివంగత రిటైర్డ్ ఎంఈఓ సుల్తాన్ సాహెబ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు న్యాయవాది ఇర్షాద్ అహమ్మద్, ఫయాజ్‌అహమ్మద్ క్రీడా దుస్తులు అందజేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. క్రీడాకారులకు తమవంతు సహాయసహకారం అందిస్తున్నామని తెలిపారు. ఫుట్‌బాల్ కోచ్ మాబుసాహెబ్, న్యాయవాదులు గురురాజారావు, రామకృష్ణ, పీడీలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు


పత్తికొండలో ఓటర్ల దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి


ఎమ్మిగనూరులో కొత్త ఓటర్ కార్డులను అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాసరరెడ్డి, తహసీల్దార్ అంజనేయులు

పత్తికొండ టౌన్: ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పాతబస్టాండు అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. 18 ఏళ్లు వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఉద్యోగులు, బీఎల్‌ఓలు, ఓటర్లు, విద్యార్థులచే నీతి, నిజాయితీగల వారికే ఓటువేస్తామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఎన్నికల డీటీ బాలరాజునాయక్, సిబ్బంది వీరేశ్, రవి, రెవెన్యూసిబ్బంది, బీఎల్‌ఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి జెడ్పీ సీఈఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాసరరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, సోమప్ప సర్కిల్‌లో ఓటు హక్కు పొందిన వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కొత్త ఓటరు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ నాసరరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినయోగించుకోవాలని పిలుపునిచ్చారు. సీనియర్ సిటిజన్లకు శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందించారు. ఎన్నికల డీటీ గురురాజరావు, వీఆర్వో షేక్షావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పరి: ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీటీ గాయత్రి, అధ్యాపకులు, విద్యార్థులు ఓటు హక్కు సద్వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. అలాగే మండలంలోని సచివాలయాలలో సిబ్బంది, ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు.

తుగ్గలి: యువత భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమని తహసీల్దార్ రవి అన్నారు. ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నిజాయితీగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు.

మద్దికెర: నిజాయితీగా పనిచేసి దేశాభివృద్ధికి పాటుపడే నాయకులను చట్టసభలకు పంపించేందుకు ప్రతిఒక్కరూ తమ ఓటును వజ్రాయుధంగా వాడుకోవాలని పూర్వ విద్యార్థులు రవి, భాస్కర్, మురళి అన్నారు. మద్దికెరలో 1999 బ్యాచ్ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులతో కలిసి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు సద్వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు.

హొళగుంద: ఓటు అనే ఆయుధంతో నవ సమాజాన్ని నిర్మించుకోవాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ పిలుపునిచ్చారు. హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్‌ఐ దినేశ్, వీఆర్‌ఓలు, హెచ్‌ఎం నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, దేశ భవిష్యత్తును ఒక్క ఓటు నిర్ణయిస్తుందని ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి మల్లికార్జున అన్నారు. స్థానిక జూనియర్ కాలేజ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు విద్యార్థులు, అన్ని శాఖల అధికారులు, బీఎల్‌ఓలతో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పిస్తోందని చెప్పారు. అనంతరం విద్యార్థులచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

కృష్ణగిరి: ప్రతి ఒక్కరు ఓటు విలువను తెలుసుకుని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని తహసీల్దార్లు రాజేశ్వరి, శివరాముడు పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా కృష్ణగిరి, వెల్దుర్తి మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిష్పక్షపాతంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.


ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఆర్వో మల్లికార్జున

నందవరం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ నిత్యానందరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు హాలహర్వి, టి.సోమలగూడూరు, పోనకలదిన్నె, నాగలదిన్నె, ముగతి, పెద్దకొత్తిలి, నదికై రవాడి, ఇబ్రహీంపురం, మాచాపురం, కే.పేట తదితర గ్రామ సచివాలయాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బీఎల్వోలు ఓటర్లకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

చిప్పగిరి: మండలంలో తహసీల్దార్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

గోనెగండ్ల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని జెడ్పీ సీఈఓ, ఆర్వో నాసరరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. గోనెగండ్లలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసిబ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు సద్వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కు ద్వారా అవినీతి పరులను పారద్రోలి, నీతి నిజాయితీ గల నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.


గోనెగండ్ల బస్టాండ్ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్

ఎమ్మిగనూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం గత డిసెంబర్‌లో నిర్వహించిన ఏహెచ్‌ఏ–2023 (పశు సంవర్ధకశాఖ ఉద్యోగాల) పరీక్షలో బనవాసి పశుసంవర్ధక పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 5, 7వ ర్యాంకులు సాధించి సత్తా చాటిన.ఈ సందర్భంగా గురువారం స్థానిక కాలేజీలో.. రవీంద్ర 5వ ర్యాంక్, వంశీ (7వ ర్యాంక్)ను ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. కాలేజీలో ఇప్పటివరకు 6 బ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయని, వారిలో దాదాపు 90 శాతం మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు గురువిష్ణు, ప్రవీణ్, సూపరింటెండెంట్ లక్ష్మణరావు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిలో డీసీఎంను వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 24న తెల్లవారుజామున ఉరవకొండ నుంచి (ఏపీ 29 వీ 9232) నంబర్ గల డీసీఎంలో బ్యారికేడ్లకు సంబంధించిన వస్తువులను హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా వెనుక నుంచి (కేఏ 51 ఏఎఫ్ 3047) నంబర్ గల ప్రైవేట్ బస్సు డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ ఏలూరుకు చెందిన షేక్ అబీబుల్లాకు గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యసాయి జిల్లాకు చెందిన బస్సు డ్రైవర్ లింగేష్‌కుమార్‌పై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


సూదేపల్లెలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వివక్ష లేని సమాజం, పేదవారికి ఉన్నత చదువులతోపాటు సమాజ ఉన్నతికి అవకాశాలు కల్పించాలన్న అంబేడ్కర్ ఆశయాలను సాధించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం వెల్దుర్తి మండలం సూదేపల్లెలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బాలకృష్ణ, అంబేడ్కర్ విగ్రహ కమిటీ ప్రతినిధులు వినోద్, నాగేశ్వరరావు, చందు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. శిలాఫలకం ఆవిష్కరించి అంబేడ్కర్ విగ్రహానికి భారీ గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. సమ సమాజ స్థాపన కోసం అంబేడ్కర్ చేసిన కృషి మహోన్నతమైనదన్నారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారి అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి జరిగిందన్నారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ ఎంట్రన్స్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. పక్షవాతానికి గురైన ఎంపీటీసీ పెద్ద రంగస్వామి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొల్ల మదనేశ్వర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, అగస్టీన్, శ్రీరాంరెడ్డి, మాధవస్వామి, హెచ్‌ఎం వరలక్ష్మి, సూదేపల్లె రామిరెడ్డి, గుంటుపల్లె జనార్దనరెడ్డి, సర్పంచ్‌లు, ఎమ్మార్పీఎస్, ఏపీ ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా


లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న యూత్ అధ్యక్షుడు బందెనవాజ్

గోనెగండ్ల: అక్కాచెల్లెళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వారికి ఆర్థిక ఆసరానిస్తూ వారి కుటుంబాల ఉన్నతికి తోడ్పాటు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు బందెనవాజ్ పేర్కొన్నారు. గురువారం గోనెగండ్లలో ఐకేపీ (వెలుగు) కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో మహిళల కష్టాలు, వారి ఆర్థిక ఇబ్బందులను కళ్లారా చూశారన్నారు. అందుకే వారికి అండగా నిలిచారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగో విడత రుణమాఫీ చేశారని తెలిపారు. మండలంలో 565 స్వయం సహాయక పొదుపు సంఘాలకు నాల్గవ విడత కింద రూ.3.48 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారని వివరించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలు సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాబువలి, మహమ్మద్, పొదుపు మహిళలు, వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఆలూరు: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య సూచించారు. స్థానిక డీఈ కార్యాలయంలో ఆయన గురువారం ఆలూరు మండలం మొలగవెల్లి, హత్తిబెళగళ్, ఆస్పరి మండలం జొహరాపురం తదితర గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు నెల్లూరప్ప, మోహన్‌రాజ్, మౌలా, ఆలూరు మార్కెట్‌కమిటీ వైస్ చైర్మెన్ ఈరన్న తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. హాలహర్వి మండలం బాపురం గ్రామ ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి గ్రామాలకు సరఫరా చేస్తున్న తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. తాగునీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఈ మోహన్‌బాబు, ఎస్‌ఎస్ ట్యాంకుల కాంట్రాక్టర్లు తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించండి


మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

ఆలూరు రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. గురువారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పక్కాగా నిర్వహించి రోగులకు టోకెన్లు అందించాలని సూచించారు. ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పీహెచ్‌సీలో 250కు పైగా రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, అవి రోగులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ కళావతి వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి నీటి విడుదల

హొళగుంద: బళ్లారి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి గురువారం ఉదయం టీబీ బోర్డు అధికారులు దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ ప్రకారంగా నీటిని ఈ నెల 25 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వదిలి ఆ తర్వాత బంద్ చేయనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో 10 రోజుల పాటు మళ్లీ నీటిని విడుదల చేస్తారు. ఇక కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలకు తాగునీటి అవసరాల కోసం చెరువులు, కుంటలను నింపుకునేందుకు ఫిబ్రవరి రెండో వారం లేదా నెలాఖరుకు నీటిని వదులుతామని బోర్డు అధికారులు చెప్పారు. జలాశయంలో నీరు అడుగంటడంతో 2023 డిసెంబర్ 25న అధికారులు ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపివేసిన సంగతి తెలిసిందే. కాగా గురువారం ఉదయం డ్యాంలో నీటిమట్టం 1588.68 అడుగులతో 9.632 టీఎంసీల నిల్వ ఉండగా ఇన్‌ఫ్లో జీరో ఉండి అవుట్‌ఫ్లో 539 క్యూసెక్కులు ఉంది.

కల్యాణం.. కమనీయం


నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు

ఎమ్మిగనూరు: పండితుల వేదమంత్రోచ్చారణలు.. పెద్దల ఒప్పందాలు.. వధూవరుల బంధుమిత్రుల సమక్షంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శోభకృత్ నామ సంవత్సరం పుష్యమాస పౌర్ణమి రోజు గురువారం రాత్రి 11.45 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ అధికారులు స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రధాన అర్చకులు సత్యనారాయణస్వామి నేతృత్వంలో స్వామివారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. వధువు తరఫున బండా కుటుంబం, వరుడి తరుపున గడిగె కుటుంబం పెద్దలుగా వ్యవహరించి కల్యాణ తంతును పూర్తి చేశారు. అంతకుముందు గురువారం తెల్లవారుజామున 5 గంటలనుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. స్వామివారికి జలాభిషేకం, తైలాభిషేకం,క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, ఆకుపూజ నిర్వహించారు. 6.15 గంటలకు స్వామివారి పందిరి పూజ నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం పందిరి మొదటి, చివరి మెట్టును వడ్డెర కులస్తులు అల్లారు. సాయంత్రం 5 గంటలకు ఎదురింటి మాచాని కుటుంబ సభ్యుల ఇంట్లో ఉన్న గొడుగును పూర్ణకుంభంతో ఆలయం వద్దకు తెచ్చి పూజలు నిర్వహించారు. అక్కడినుంచి మేళతాళాలతో, ధర్మకర్త కుటుంబ సభ్యులు కలశాలతో తేరుబజారు చేరుకొని పూజలు నిర్వహించి గొడుగును మహారథంపై ప్రతిష్ఠించారు. నీలకంఠేశ్వర స్వామి, పార్వతి దేవి విగ్రహాలను పుష్పక రథంపై ఉంచి రామస్వామి ఆలయం వరకు తీసుకెళ్లి తిరిగి నీలకంఠేశ్వర స్వామి ఆలయం వరకు రథోత్సవం నిర్వహించారు. భక్తులు రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు. ఆలయ ధర్మకర్త మురళీధర్, జగదీశ్, శివశంకర్, నాగేశప్ప, శ్రీకాంత్, సురేష్, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

28న చంద్రబాబు రాక


పత్తికొండ రూరల్: పత్తికొండలో ఈనెల 28వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటిస్తారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు గురువారం తెలిపారు. పత్తికొండ–ఆదోని రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో మధ్యాహ్నం జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారన్నారు. ఈనెల 25న జరగాల్సిన చంద్రబాబు పర్యటన వాయిదా పడిన సంగతి తెలిసిందే.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలకేంద్రంలో గురువారం రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎస్సీ కాలనీలో శాంతమ్మ ఇంటి నుంచి దేవేంద్రప్ప ఇంటి వరకు రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పన సాధ్యపడిందన్నారు. దీంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి

ఆలూరు: మండల కేంద్రంలో వారపు కూరగాయల సంత మార్కెట్ వద్ద రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణ స్వామి మండల కన్వీనర్ వీరేష్ సమక్షంలో భూమి పూజ చేశారు. రోడ్డు పనులు పూర్తయితే కూరగాయాల విక్రయదారులు, కొనగోలుదారులకు ఇబ్బందులు ఉండవన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయాలతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనకు విరాళం

చిప్పగిరి: మండలంలోని దేగులహాలు గ్రామంలో గురువారం నిర్వహించిన నాటక ప్రదర్శన కార్యక్రమానికి మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో రూ.50 వేల విరాళాన్ని ఆయన సోదరుడు నారాయణ స్వామి, ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ విరాళం అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జూటూరు మారయ్య, నీలకంఠ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు అమకతాడు జట్టు


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఆడుదాం– ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీల్లో కృష్ణగిరి మండలం నుంచి అమకతాడు బాలికల జట్టు విజేతగా నిలిచింది. 24న పత్తికొండలో జరిగిన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి రూ.35 వేల నగదు బహుమతి అందుకోవడంతో పాటు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ రామస్వామి, ఈఓఆర్డీ మురళీమోహన్ తెలిపారు. కృష్ణగిరి మండలం నుంచి కబడ్డీతో పాటు వాలీబాల్ పురుషుల పోటీల్లో ఎస్‌హెచ్ ఎర్రగుడి జట్టు మూడవ స్థానంలో నిలిచినట్లు వారు తెలిపారు. 27న క్రికెట్, ఖోఖో పోటీల్లో కూడా మండల క్రీడాకారులు సత్తా చాటాలన్నారు. కబడ్డీలో రాణించి జిల్లా స్థాయికి ఎంపికైన బాలికలను, పీఈటీ శేఖర్‌ను గురువారం అభినందించారు.


నియోజకవర్గ స్థాయి క్రికెట్ విజేతగా నిలిచిన ఆలూరు జట్టు

క్రికెట్ విజేత ఆలూరు జట్టు

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం-ఆంధ్రా నియోజవకర్గ స్థాయి క్రికెట్ ఫైనల్‌లో ఆలూరు జట్టు విజయం సాధించింది. గత నెల 15వ తేది నుంచి సచివాలయ స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర-2 పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్‌లో ఆలూరు, చిప్పగిరి జట్లు తలపడ్డాయి. ఆలూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 122 పరుగులు చేయగా ఛేదనకు దిగిన చిప్పగిరి జట్టు 12 ఓవర్లలో 90 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయ్యింది. ఆస్పరి జట్టు మూడవ స్థానంలో నిలిచింది. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన ఆలూరు జట్టు కర్నూల్లో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటుందని అధికారులు తెలిపారు.

పకడ్బందీగా కులగణన


గంగవరంలో కుల గణన సర్వే చేస్తున్న సిబ్బంది

నందవరం: మండలంలో కుల గణన సర్వే శరవేగంగా సాగుతుంది. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యులు వివరాలు నమోదు చేస్తున్నారు. నందవరం మండలంలో గురువారం నాటికి సర్వే 60.23 శాతం పూర్తయ్యింది. మండల కేంద్రంతో పాటు గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, హాలహర్వి, సోమలగూడూరు, పొనకలదిన్నె, కనకవీడు, నాగలదిన్నె, గురజాల, రాయచోటి, మాచాపురం, ఇబ్రహీంపురం, నదికైరవాడి, పూలచింత, ముగతి తదితర గ్రామాల్లో సర్వే వేగంగా సాగుతోంది. కులగణన సర్వేను ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కులగణన సర్వే నిర్వహిస్తోందన్నారు. మండలంలో 20,155 కుటుంబాలకు గానూ 12,140 కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

29న సొసైటీ భవనం ప్రారంభోత్సవం


హొళగుందలో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం

హొళగుంద: హొళగుంద సమీపంలోని శ్రీరాంనగర్ క్యాంప్‌లో అన్ని హంగులతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) నూతన కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఈ భవనాన్ని ఈ నెల 29న ప్రారంభించనున్నట్లు సింగిల్ విండో చైర్మన్ మేలగిరి మల్లికార్జున తెలిపారు. నాబార్డ్, ఆప్కాబ్, డీసీసీబీ రుణాలతో నిర్మాణం పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయ మనోహరి, ఇతర ప్రముఖులను ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. కొత్త భవనం గోడౌన్, బ్యాంక్ లాకర్ ఇలా అనేక సదుపాయలతో నిర్మించినట్లు తెలిపారు.